31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

శనివారం, ఆగస్టు 01, 2026 పేజీలు : 8

## ఆపరేషన్-12 ముస్కాన్ విజయవంతం

**-జిల్లాలో 63 మంది బాల కార్మికులకు విముక్తి**
**-జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్**



**చురకలుప్రతినిధి, జగిత్యాల, జూలై 31** : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతో పాటు తప్పిపోయిన, విడిచిపెట్టబడిన చిన్నారులను గుర్తించి వారి కుటుంబాలకు చేర్చే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఆపరేషన్ ముస్కాన్-12 కార్యక్రమాన్ని జగిత్యా ల జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. బాలల సంరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రతి సంవత్సరం రెండు సార్లు ఆపరేషన్ స్మైల్ మరియు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను -మిగతా 2లో

### గోదావరి వరద ప్రవాహాన్ని
## పరిశీలించిన కలెక్టర్ సత్యప్రసాద్



**చురకలు, జగిత్యాల** : గత రెండు రోజులుగా జిల్లాలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ధర్మపురి మండలం రాయ పట్నం వద్ద గల గోదావరి నది వరద ప్రవాహాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గోదావరిలో ప్రస్తుతం ఉన్న నీటి మట్టం, వరద ప్రవాహం, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో, వరద పరిస్థితులపై సంబంధిత అధికారు లను అడిగి తెలుసుకున్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నది తీర ప్రాంత గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైతే తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు సిద్ధంగా ఉంచా లని సూచించారు. వరద పరిస్థితులపై నిరంతరం నిఘా ఉంచి, సంబంధిత శా ఖల అధికారులు సమన్వయంతో పనిచే స్తూ ప్రజలకు అవసరమైన సహాయ చర్య లు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. గోదావరి నదిలోకి మత్స్యకారులు వెళ్ల కుండా, వరద ప్రవాహాన్ని దగ్గరగా వీక్షిం చేందుకు నదీ తీరాలకు చేరుకోవద్దని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలనలో ఆర్డీఓ మధు సూదన్, తహసీల్దార్ ఎరుకొండ శ్రీనివాస్, ఎంపిడివో పత్తి రవీందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### శ్రీపాద ఎల్లంపల్లి జలకళకు
## కాంగ్రెస్ ప్రభుత్వ దూరదృష్టే కారణం

**-బిఆర్ఎస్ అబద్దాలు అందులో కొట్టుకుపోయాయి**
**-రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్**




**చురకలు, విలేఖరి, వెల్గటూర్, జూలై 31.** శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు వరద జలాలతోకళకళలాడుతుండడం కాంగ్రెస్ ప్రభుత్వాలు రూపొందించిన శాస్త్రీయ ప్రణాళికలకు నిదర్శనమని, ఈ పరిణామంతో బీఆర్ఎస్ నాయకులు సంవత్సరాలుగా ప్రజలను నమ్మించిన అబద్ధా లన్నీఅందులో కొట్టుకుపోయా యని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం సీఎల్పీ మీడియా సెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం పూర్తి స్థాయిలో నిండిందని, అక్కడి నుంచి మిడ్ మానేర్, లోయర్ మానేరు సహా దిగువన ఉన్న రిజర్వాయర్లకు నీటి విడుదల కుప్రభుత్వంసిద్ధమైందన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డిహయాం లో కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టునుభవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొ ని గ్రావిటీఆధారితవరద కాలు వలతో రూపొందించిందని తెలిపారు. అందువల్లే ఈరోజు ఎలాంటి ఎత్తిపోతలఅవసరం లేకుండానే వరద జలాలు సహజసిద్ధంగా ఎల్లంపల్లికి చేరాయని చెప్పారు. దీనిపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. కన్నెపల్లి పంప్ హౌస్ వద్ద మోటార్లు ఆన్ చేయాలని బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున హంగామా చేశారని, కానీ ఎలాంటి పంపింగ్ అవసరం లేకుండానే ఎల్లంపల్లి జలా శయం నిండిపోవడంతో వారి వాదనలు పూర్తిగా అబద్ధమ ని తేలిపోయాయన్నారు. మా వల్లే నీళ్లు వచ్చాయి అంటూ గొప్పలుచెప్పుకున్న బిఆర్ఎస్ నాయకుల -మిగతా 2లో

### పదవీ విరమణ జీవితంలో
## కొత్త అధ్యాయానికి నాంది

**జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్**



**చురకలు విలేకరి, రాయికల్, జూలై 31:** పదవీ విరమణ అనేది విశ్రాంతి మాత్రమే కాదు జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం రాయికల్ పట్టణంలోని ఆర్ ఆర్ గార్డెన్ లో పంచాయతీ రాజ్ ఏఈ చింత వెంకటేశ్వర ప్రసాద్ పదవి విరమణ మహోత్సవం కార్యక్రమానికి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్నో సంవత్సరాల పాటు నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో ప్రజలకు సేవ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. పదవి అనేది ముగిసినా సేవ చేసే అవకాశం ఎప్పటికీ ముగియదని వారి అనుభవం సమాజానికి ఎంతో విలువైందని తెలిపారు. యువతకు,కొత్తగా ఉద్యోగంలో చేరే వారికి మీ సేవా ప్రస్థానం ఆదర్శంగా నిలుస్తుంద న్నారు. కుటుంబ సభ్యుల సహకారం కూడా విజయానికి ఎంతో దోహద పడుతుందన్నారు. మంచి ఆరోగ్యం,ఆనందం, ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాక్షించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజంగి నందయ్య, జెడ్పీ సీఈవో గౌతమ్ రెడ్డి, పంచాయతీ రాజ్ఎస్ ఈ రెహమాన్, ఆత్మ చైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ మోర హన్మండ్లు, మాజీ ఎంపీపీ సంధ్యారాణి సురేందర్ నాయక్, రాజ్ అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

### ప్రభుత్వం డీజిల్ ఆటో కార్మికుల
## సంక్షేమానికి కృషి చేయాలి

**మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 31 :** ప్రభుత్వం డిజిల్ ఆటో కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్స్‌లో శుక్రవారం నిర్వహించిన డీజిల్ ఆటో సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాజీ మంత్రి టి. జీవన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సంఘం అధ్యక్షుడు ద్యావరా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అయూబ్ పాషా, గౌరవ అధ్యక్షుడు బొల్లి శేఖర్, ముఖ్య సలహాదారులు కొండూ శ్రీనివాస్‌రావు, ముజీబ్ లతీఫ్, ఉపాధ్యక్షుడు ఎస్కే అలీమ్, న్యాయ సలహాదారులుగా బాధ్యతలు స్వీకరించిన రాచకొండ శ్రీరాములు, తునికి మధుసూదన్‌తో పాటు నూతన కార్యవర్గ సభ్యులను జీవన్‌రెడ్డి శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో యూనియన్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. డీజిల్ ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘం ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఆర్టీఏ నిబంధనలు మరింత కఠినంగా అమలవుతున్న నేపథ్యంలో ప్రతి ఆటో డ్రైవర్ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను సక్రమంగా నిర్వహించుకోవాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్‌ల పునరుద్ధరణ, రవాణా నిబంధనల పాటింపు, ప్రభుత్వ -మిగతా 2లో

## గంజాయితో దొరికిన ఈగిల్ టీం కానిస్టేబుల్

### వివరాలు వెల్లడించిన ఏసిపి విజయ్ కుమార్



చురకలు ప్రతినిధి, కరీంనగర్ జులై 31: మాదకద్రవ్యాల నియంత్రణ విభాగంలో పనిచేస్తూ స్నేహితుని కోసం అతని ప్రత్యర్థి పై అక్రమ కేసు పెట్టేందుకు గంజాయి నిల్వచేసిన ఈగల్ టీం కానిస్టేబుల్ ను పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడిన నిందితుని వివరాలను కొత్తపెల్లి పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రూరల్ ఏసిపి విజయ్ కుమార్ వెల్లడించారు. కరీంనగర్ మండలం సీతారాంపూర్ లో నివాసముంటున్న ఈగల్ టీం కానిస్టేబుల్ మెడబోయిన నాగరాజు వద్ద గంజాయి నిల్వ ఉందన్న సమాచారంతో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి 370 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నాగరాజును విచారించగా చిగురుమామిడి మండలం కొండాపూర్ కు చెందిన శ్రీనివాస్ కు నాగరాజుకు పరిచయం ఉంది. అదే గ్రామంలో శ్రీనివాస్ కు శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తులకు మధ్య భూతగాదాలు ఉండడంతో అవి ఎన్నిసార్లు పంచాయతీ నిర్వహించిన కొలిక్కి రాకపోవడంతో అతన్ని కేసులో ఇరికించాలనే ఉద్దేశంతో నాగరాజు శ్రీనివాసులు కలిసి పథకం పన్నారు. స్నేహితుని కోసం కానిస్టేబుల్ నాగరాజు వరంగల్ నుంచి గంజాయి తెప్పించి శ్రీనివాస్ రెడ్డికి చెందిన ఎరువుల దుకాణంలో పెట్టాడు. తిరిగి పోలీసులకు సమాచారం అందించి చిరుమామిడి పోలీస్టేషన్లో కేసు నమోదయ్యేలా చేసి కటకటాల పాలు చేశారు. వరంగల్ నుంచి తెప్పించిన గంజాయిలో కిలో గంజాయి శ్రీనివాస్ రెడ్డి దగ్గర దొరికినట్లు చూపించగా మిగిలిన 3 70 గ్రాముల గంజాయిని తన ఇంట్లో నిల్వ ఉంచుకున్నాడు. పక్కా సమాచారం అందుకున్న పోలీసులు నాగరాజు ఇంట్లో దాడులు నిర్వహించి గంజాయి తోపాటు నాలుగు సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన కానిస్టేబుల్ పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు తరలిస్తామని ఏసిపి విజయ్ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో ఏసీబీ వెంట కొత్తపల్లి ఇన్స్పెక్టర్ కోటేశ్వర్ పాల్గొన్నారు.

## ఘనంగా ఉపసర్పంచ్ పుట్టినరోజు వేడుకలు



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్, జూలై 31:** కమాన్ పూర్ మండలం జూలపల్లి గ్రామ ఉపసర్పంచ్ గడ్డం రాజ మహేందర్ జన్మదిన వేడుకలు శుక్రవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. తోటి ఉపసర్పంచులు ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు వడ్నాల శ్రీనివాస్ (నాగారం) చొప్పరి శేఖర్ (పెంచికలపేట) కొత్తపల్లి సతీష్ (సిద్ది పల్లె ) అంబిరి రాజేందర్ (గుండారం) ముత్యం శ్యాంసుందర్ గౌడ్ (రొంపి కుంట) తోపాటు చత్రపతి శివాజీ యువసేన అధ్యక్షుడు మల్యాల శేఖర్ తదితరులు హాజరై శాల్వతో సత్కరించి కేక్ కట్ చేయించారు. కేక్ తినిపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజ మహేందర్ తోటి ఉపసర్పంచులకు ధన్యవాదాలు తెలిపారు.

## ప్రభుత్వం డీజిల్ ఆటో కార్మికుల...

**మొదటి పేజీ తరువాయి....** సంక్షేమ పథకాల వినియోగంపై సభ్యులు పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ఆటో కార్మికులకు అన్ని రకాల సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు.సంఘం బలోపేతంతోనే ఆటో కార్మికుల హక్కులు పరిరక్షించబడతాయని పేర్కొన్న జీవన్‌రెడ్డి, కార్మికుల సంక్షేమానికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, సభ్యులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ఆటో కార్మికులు పాల్గొన్నారు.

# శ్రీపాద ఎల్లంపల్లి జలకళకు...

మాటలకు ప్రకృతి స్వయంగా సమాధానం చెప్పిందని వ్యాఖ్యానించారు.మాజీ మంత్రి హరీష్ రావు నెల రోజుల సమయం ఇస్తే నీటిని ఎత్తిపోస్తానని గొప్పలు చెప్పారని, ఈరోజు ఎలాంటి లిఫ్టులు లేకుండానే నీరు ఎల్లంపల్లికి చేరిందని గుర్తుచేశారు. ఇప్పుడు హరీష్ రావు తన వ్యాఖ్యలపై ప్రజల కు వివరణ ఇవ్వాలని మంత్రి అన్నారు. బీఆర్ఎస్ ప్రజల కష్టసుఖాలను పక్కనపెట్టి రాష్ట్రంలో కరువు రావాలని, రైతులు,ప్రజలునష్టపోవాలని కోరుకుంటుందని తీవ్రంగా విమర్శించారు. వర్షాలు బాగా కురిస్తే ఓర్వలేకపోవడం, రైతులు ఆనందంగా నాట్లు వేస్తుంటే బాధపడటం వారి రాజకీయదివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. రాష్ట్రం లో నాగార్జునసాగర్, శ్రీశైలం, శ్రీరాంసాగర్,శ్రీపాద ఎల్లంపల్లి, మిడ్ మానేరు వంటి కీలక ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వా లహయాంలో నిర్మించబడగా ఈ ప్రాజెక్టుల నాణ్యతపై ఏనాడూ ప్రశ్నలు రాలేదని, నిర్మాణ లోపాల ఆరోపణలు లేవని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో వేల కోట్ల వ్యయం తో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నేడు ప్రజల ముందే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును మధ్యలో నిలిపివేసి, కమిషన్ల కోసం భారీ ఎత్తిపోతలతో కూడిన కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని ఆరోపించారు. తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ఉంటే సహజ గ్రావిటీ ద్వారానే నీటి సరఫరా జరిగే దని పేర్కొన్నారు. ప్రజా ప్రయో జనాల కంటే రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలకే బీఆర్ఎస్ ప్రాధాన్యం ఇచ్చిందని విమర్శ చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టు పరిశీలకు ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ నాయకులను ఒక్క రోజు కూడా అనుమతించ లేదని, మేడిగడ్డ వద్ద శాశ్వత పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేసి అడ్డుకున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ బీఆర్ఎస్ నాయకులకు మేడిగడ్డ సందర్శనకు అనుమతి ఇచ్చిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై వేసిన కమిషన్ నివేదికను అసెంబ్లీ లో చర్చకుపెడితే బీఆర్ఎస్ సభ్యులుచర్చచేయకుండా తప్పించుకున్నారని ఆరోపిం చారు. ఇంజినీర్లు మేమే, డిజైనర్లు మేమే అంటూ గొప్పలు చెప్పుకున్న నాయకులు ఇప్పుడు ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఎల్‌నినో వల్ల కాదు,రేవంత్ రెడ్డి తెచ్చిన కరువుఅంటూ నిరాధార ఆరోపణలు చేసిన బీఆర్ఎస్ నాయకులు, రాష్ట్ర వ్యాప్తంగా సమృద్ధిగా కురుస్తు న్న వర్షాలపై ఏమిసమాధానం చెబుతారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం,సాగునీటి భద్రత, వ్యవసాయాభివృద్ధిని లక్ష్యం గా పెట్టుకుని పనిచేస్తోందని, అందుకే ఉత్తర తెలంగాణలో ఈ ఏడాది విస్తారంగా సాగు జరుగుతోందని, అధిక వరి దిగుబడులకు పరిస్థితులు అనుకూలిస్తున్నాయని పేర్కొన్నారు.ప్రజలుకోరుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వ మని, ప్రజల ప్రయోజనాలే పరమావధిగా పనిచేస్తున్నట్లు మంత్రి అడ్లూరి స్పష్టంచేశారు. బీఆర్ఎస్ నాయకులు ఇప్పటి కైనా బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా వ్యవహరించాల ని,లేకపోతే ప్రజలే తగిన శాస్తి చేస్తారాని హెచ్చరించారు.

# ఆపరేషన్-12 ముస్కాన్ విజయవంతం

**మొదటి పేజీ తరువాయి....** నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జూలై 1 నుంచి జూలై 31 వరకు జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ ముస్కాన్-12 చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవం తంగా అమలు చేయడానికి ప్రతి సబ్డివి జన్ పరిధిలో ఒక సన్ఇన్స్పెక్టర్, ముగ్గు రు కానిస్టేబుళ్లు, ఒక మహిళా కానిస్టే బుల్తో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థల సహకా రంతో హోటళ్లు, పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, ఇతర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో జిల్లా వ్యాప్తంగా 63 మంది బాల కార్మికులను గుర్తించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరిచినట్లు తెలిపారు. అలాగే 18 సంవత్సరాల లోపు పిల్లలతో పనులు చేయిస్తున్న యజమానులపై 26 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాలల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్నా, బాల కార్మికులు ఎక్కడైనా పనిచేస్తున్నా, లేదా తప్పిపోయిన, విడిచి పెట్టబడిన చిన్నారుల సమాచారం తెలిసినా వెంటనే 1098 చైల్డ్ హెల్ప్ లైన్ లేదా డయల్ 100కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. బాల కార్మికులను పనిలో పెట్టుకునే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆపరేషన్ ముస్కాన్-12 విజయవంతం కావడానికి సహకరించిన పోలీసు శాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, విద్యాశాఖ, వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ శాఖ, జిల్లా బాలల సంరక్షణ యూనిట్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, చైల్డ్ లైన్ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# దేవాదాయ శాఖలో చారిత్రాత్మక పరిపాలనా విప్లవం

**ధర్మపురి చురకలు, రామ కిష్టయ్య సంగన భట్ల, :** తెలంగాణ రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలో శ్రమకోర్చి సేవలందించే ఉద్యోగ వర్గాల ఆకాంక్షలకు పట్టం కడుతూ, దేవాదాయ ధర్మాదాయ శాఖలో సాకారమైన నూతన సంస్కరణల పరంపర ధార్మిక వ్యవస్థలోనే ఒక నవశకానికి నాంది పలికింది. ముఖ్యమంత్రి శ్రీ అలుగుబెల్లి రేవంత్ రెడ్డి ఇచ్చే నవోత్సాహం, ఊపిరులూదే సంస్కరణాత్మక దృక్పథం ప్రాతిపదికగా... అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ సమర్థవంతమైన నాయకత్వంలో, శాఖీయ యంత్రాంగం సరికొత్త దిశగా అడుగులు వేస్తోంది. ఇటీవల హైదరాబాద్ బొగ్గులకుంట లోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియం (దేవులపల్లి రామానుజరావు కళామందిరం) వేదికగా నిర్వహించిన నూతన పదోన్నతుల కార్యక్రమం కేవలం ఒక సాంకేతిక



సమావేశంగా ముగిసిపోక, దశాబ్దాల తరబడి నిరీక్షించిన ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన అపురూపమైన పరిపాలనా క్రతువుగా భాసించింది. దశాబ్దాలుగా నలిగిపోతున్న ఉద్యోగుల సమస్యలను తుదిముట్టించాలనే దృఢ సంకల్పంతో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు చూపిన అసాధారణ చొరవ, అహర్నిశల కృషి మరియు ప్రిన్సిపాల్ సెక్రటరీ శ్రీమతి శైలజా రామయ్యర్ అందించిన నిరంతర పరిపాలనా సహకారం, మంత్రి కొండా సురేఖ త్వరితగతిన తెలిపిన ఆమోదముద్రలు ఒకటై ఈ చారిత్రాత్మక ఘట్టానికి ప్రాణం పోశాయి. ఈ మహోత్సవంలో మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా 48 మంది ఉద్యోగులు గ్రేడ్--3 కార్యనిర్వహణాధికారులుగా, ఇద్దరు గ్రేడ్--2 కార్యనిర్వహణాధి కారులుగా, ఒకరు గ్రేడ్--1 కార్యనిర్వహణాధి కారిగా---మొత్తం 51 మంది ఉద్యోగులు పదోన్నతి పత్రాలను అందుకున్నారు. అదే వేదికపై అర్చక సంక్షేమ నిధి ద్వారా అర్హులైన 15 మంది అర్చకులు మరియు వారి కుటుంబ సభ్యులకు పదవీ విరమణ ప్రయోజనాలు, మరణ గ్రాట్యుటీ, వివాహ రుణాలకు సంబంధించిన ఆమోద ఉత్తర్వులను సమర్పించడం ప్రభుత్వ సంక్షేమ పారదర్శకతకు నిదర్శనంగా నిలిచింది. దేవాదాయ శాఖలో సుదీర్ఘకాలంగా ఎదురవుతున్న కాగితాల చట్రాలను బద్దలు కొడుతూ, ఉద్యోగుల హక్కులకు భరోసా కల్పిస్తూ చేపట్టిన ఈ నిర్ణయాలు శాఖ సమగ్ర వికాసానికి దారితీస్తున్నాయి.దేవాదాయ శాఖ అనేది సాధారణ పరిపాలనా విభాగాలు వంటిది కాదు. ఇది తెలంగాణ వ్యాప్తంగా విస్తరించి ఉన్న వేలాది ప్రాచీన, ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రాల నిర్వహణతో పాటు, అసంఖ్యాకమైన ఆలయ భూములు, ఆస్తుల సంరక్షణను, సనాతన ధార్మిక సంప్రదాయాల కొనసాగింపును, నిత్యం ఆలయాలకు విచ్చేసే కోట్ల మంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించే అత్యంత బాధ్యతాయుతమైన వ్యవస్థ.

## వర్షకొండలో పౌరహక్కుల దినోత్సవం



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం జూలై (31) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండ గ్రామంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. అధికారులు రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులు, విధులు, సామాజిక సమానత్వం,న్యాయం ప్రజాస్వామ్య విలువల పరిరక్షణపై అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ పోసుకంటి వెంకట్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు తన హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తించి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకుంటూ చట్టాలను గౌరవించాలన్నారు.అనంతరం ఎస్సీ హాస్టల్ వార్డెన్ పెద్దులు, హెడ్ కానిస్టేబుల్ హరీంద్రనాథ్ మాట్లాడుతూ విద్య, ఉపాధి, సామాజిక న్యాయం వంటి అంశాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను ప్రజలు వినియోగించుకోవాలని సుచించారు. గ్రామస్థుల్లో చట్టాలపై అవగాహన పెంపొందించడం ద్వారా సమాజంలో శాంతి, సామరస్యం నెలకొంటుందన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, వార్డు సభ్యులు కాలేశ్వరం రాకేష్, తాండ్ర దశరథ్, యువకులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం తీరని లోటు

**-మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంతాపం**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 31 :** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆకస్మిక మరణం పట్ల మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం ప్రజా జీవితానికి తీరని లోటని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమ స్ఫూర్తితో పనిచేస్తూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. అలాగే, దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

# తుమ్మల చెరువుకు గండి...

**-వృథాగా దిగువకు వెళుతున్న నీరు**
**-భారీ వర్షాల ధాటికి దెబ్బ తిన్న చెరువు కట్ట**
**-ఆందోళనలో రైతులు, తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అధికారులకు వినతి**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం జూలై (31) :** గత రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని భారీవర్షాల కారణంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గ్రామ శివారులో ఉన్న తుమ్మల చెరువుకు గండి పడింది.వరద నీటి ఉధృతి పెరగడంతో చెరువు కట్టలో ఒక భాగం దెబ్బతిని గండి ఏర్పడగా, చెరువులో నిల్వ ఉన్న నీరు పెద్ద ఎత్తున దిగువ ప్రాంతాలకు వృథాగా వెళ్లిపోతోంది.దీంతో సాగునీటి అవసరాల కోసం చెరువుపై ఆధారపడిన రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.తుమ్మల చెరువు వేములకుర్తి గ్రామ పరిధిలోని పలు వ్యవసాయ భూములకు ప్రధాన నీటి వనరుగా ఉపయోగపడుతోంది. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురుస్తున్న నేపథ్యంలో చెరువు పూర్తిస్థాయిలో నిండుతుండగా,గండి ఏర్పడటంతో నిల్వ ఉండాల్సిన నీరు బయటకు వెళ్లిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.చెరువులో నీరునిల్వ ఉంటే రాబోయే సాగు కాలానికి ఎంతో 80 ఎకరాలకు నీరు ఉపయోగపడేదని, గండి కారణంగా నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతుందన్నారు.శుక్రవారం గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎడిపెల్లి మురళి,గ్రామసర్పంచ్ తరి రామానుజం, రైతులతో కలిసి గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించారు.గండి ఏర్పడిన ప్రాంతం లో నీటి ప్రవాహం తీవ్రంగా ఉండటం తో పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి సంబంధిత శాఖ అధికారులకు సమాచారం అందించారు. చెరువు కట్ట మరింత దెబ్బతినకుండా వెంటనే రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు.అనంతరం సంబంధిత శాఖ అధికారిణి కవితకు ఫోన్ ద్వారా సమాచారం అందించి, అత్యవసరంగా మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు.వర్షాలు కొనసాగు తున్న నేపథ్యంలో గండి మరింత విస్తరించే అవకాశం ఉందని,దీంతో చెరువుకు మరింత నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వివరించారు. చెరువు కట్టను బలోపేతం చేసి గండిని పూడ్చి వేయకపోతే భవిష్యత్తులో పెద్ద మొత్తం లో నీటి నష్టం జరిగే అవకాశం ఉందని తెలిపారు.ప్రతి సంవత్సరం వర్షాకాలం లో చెరువులకు సంబంధించిన మరమ్మతులు ముందుగానే చేపడితే ఇలాంటి సమస్యలు తలెత్తవని అన్నారు.నీటి వృథాను అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని రైతులు కోరారు.

# స్నేహబంధానికి నిలువెత్తు నిదర్శనం

**-సాదుల్లా కుటుంబానికి రూపాయలు 51 వేల ఆర్థికసహాయం**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం జూలై (31) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గోధూర్ గ్రామానికి చెందిన ఎం.డి సాదుల్లా ఆకస్మిక మరణంతో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న సాదుల్లా పదవ తరగతి సహపాఠులు మానవత్వాన్ని చాటుతూ ముందుకు వచ్చారు.శుక్రవారం స్నేహితుడి కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో పదవ తరగతి మిత్రులు తలా కొంత మొత్తాన్ని విరాళం రూపాయలు. 51వేలను సమీకరించారు. ఈ మొత్తాన్ని సాదుల్లాకుమార్తె భవిష్యత్తు దృష్ట్యా ఆమె పేరుపై పోస్టాఫీసులో ఫిక్స్డ్ డిపాజిట్‌గా జమచేశారు. గ్రామ సర్పంచ్ బండి రాజేష్,ఉపసర్పంచ్ ఓంకారిలక్ష్మణ్ ఆధ్వర్యంలో బాండ్‌ను సాదుల్లా కుటుంబ సభ్యులకు అంద జేశారు.ఈకార్యక్రమంలో మిత్ర బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పదవి విరమణ పొందిన అధికారుల సేవలు స్ఫూర్తివంతం

**-జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 31:** ఏళ్లపాటు పోలీస్ శాఖలో పని చేసి పదవి విరమణ పొందిన అధికారుల సేవలు స్ఫూర్తివంతంగా నిలుస్తాయని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. పోలీసు శాఖలో దీర్ఘకాలం పాటు అంకితభావం తో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న పోలీసు అధికారు లను జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో పనిచేయడం అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాకుండా సమాజానికి సేవ చేసే గొప్ప బాధ్యత అని అన్నారు. ఉద్యోగ జీవితమంతా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమించిన అధికారులు సేవలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనేది సేవలకు ముగింపు మాత్రమేనని,జీవి తంలో కొత్త అధ్యాయానికి నాంది అని పేర్కొన్నారు. రిటైర్ అవుతున్న అధికారులు తమ అనుభవాన్ని సమాజానికి ఉపయోగపడే విధంగా వినియోగించుకోవాలని, కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన అధికారులు బి. ఆనందం (ఏఎస్ఐ), ఎమ్. శ్రీనివాస్ (ఏఎస్ఐ), జి.రవి (హెడ్ కానిస్టేబుల్) లను జిల్లా ఎస్పీ శాలువా కప్పి,జ్ఞాపికలు అందజేసి, పుష్పగుచ్ఛాల తో ఘనంగా సత్కరించి వారి సేవలను అభినందించారు. అలాగే వారి కుటుంబ సభ్యులకు కూడా శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఉద్యోగ కాలంలో అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన అధికారులు మాట్లాడుతూ పోలీసు శాఖలో పనిచేసిన ప్రతి రోజు తమ జీవితంలో ఒక మధుర జ్ఞాపకమని పేర్కొన్నారు. తమ సేవా కాలంలో సహకరించిన జిల్లా పోలీసుఉన్నతాధికారులు, సహోద్యోగులు , సిబ్బంది అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు శాఖలో పనిచేసే అవకాశం లభించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని, భవిష్యత్తులో కూడా సమాజానికి తమవంతు సేవలు అందిస్తామన్నారు. అనంతరం పదవి విరమణ పొందిన అధికారులను పోలీసు వాహనంలో ఎక్కించి పోలీస్ బ్యాండ్ తో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, ఎస్పి ఇన్స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్, ఎస్.ఐ శ్రీకాంత్ సిబ్బంది, రిటైర్డ్ అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన పోలీసులను సత్కరించిన ఎస్పీ



**చురకలు ప్రతినిధి,నిర్మల్, జూలై 31 :** నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో పోలీసు శాఖలో సుదీర్ఘకాలం విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ.జానకి షర్మిల ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన వారికి శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు ఉద్యోగం అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం అంకితభావంతో పనిచేసే అత్యంత బాధ్యతాయుతమైన సేవ అని అన్నారు. ఎలాంటి పరిస్థితులనైనా ధైర్యంగా ఎదుర్కొంటూ శాంతిభద్రతల పరిరక్షణలో, నేర నియంత్రణలో, ప్రజలకు భరోసా కల్పించడంలో పోలీసు సిబ్బంది అందించిన సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు. పదవీ విరమణ అనేది ప్రభుత్వ విధులకు మాత్రమే ముగింపు అని, సమాజ సేవకు కాదని పేర్కొంటూ, తమ అనుభవాన్ని యువతకు, సమాజానికి పంచుతూ మార్గదర్శకులుగా కొనసాగాలని సూచించారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన డీఎస్‌బీ నిర్మల్‌కు చెందిన ఎస్ఐ ఎం.నరసయ్య, నిర్మల్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ ఎం. తారాచంద్ (1764), బాసర పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ వై. గంగాధర్ (480), లక్ష్మణచాందా పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎల్. శంకర్ (2388) లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, పోలీసు శాఖకు వారు అందించిన విశిష్ట సేవలను కొనియాడుతూ సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) ఎం.డి. యూనుస్ అలీ, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, నిర్మల్ రూరల్ సీఐ కృష్ణ, నిర్మల్ టౌన్ సీఐ సమ్మయ్య, ఆర్ఐ రామ్‌నిరంజన్, ఆర్ఎస్ఐ రామకృష్ణతో పాటు జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు, పోలీసు సిబ్బంది, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు

## లో-లెవెల్ బ్రిడ్జిని పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



**చురకలు ప్రతినిధి కోరుట్ల జూలై 31 :** కోరుట్ల మండలం కల్లూరు గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న లో-లెవెల్ బ్రిడ్జిని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి పరిస్థితిపై జిల్లా కలెక్టర్‌తో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. గ్రామ ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించేలా హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, భారీ వర్షాల కారణంగా మిషన్ భగీరథ ప్రధాన పైపులు దెబ్బతిని విరిగిపోవడంతో పలు గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయిందని తెలిపారు.యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టి, ప్రభావిత గ్రామాలకు వీలైనంత త్వరగా తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండి అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు.

## వైభవంగా ఆషాఢమాస బోనాల జాతర



**చురకలు విలేకరి,జగిత్యాల,జూలై 31 :** జగిత్యాల పట్టణంలోని పురాణిపేట ఆంజనేయస్వామి దేవాలయం, కృష్ణానగర్ వంజరి సంఘం ఆధ్వర్యంలో మహాలక్ష్మి అమ్మవారికి డప్పు చప్పుళ్ళ, నృత్యాలతో భక్తులు బోనాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసంలో అమ్మవారికి ప్రీతి కరమైన శుక్రవారం రోజున పురాణిపేట ఆంజనేయ దేవాలయంలో అమ్మ వారికి భక్తుల ఆధ్వర్యంలో బోనాల పండుగ వేడుక జరుపుతూ వస్తున్నామని, ఎల్నీ ప్రభావం పూర్తిగా తొలగి వర్షాలు సంవృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. తదనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

## వైద్య ఖర్చులకు విరాళం అందజేత



**చురకలు విలేకరి, ధర్మపురి, జూలై 31 :** షుగర్ సమస్యతో ఎడమ కాలు తొలగించడమే కాకుండా పక్షవాతం సోకి మంచానికే పరిమితమైన నిరు పేద బాధితుడికి వైద్య ఖర్చుల కోసం ఫేస్ బుక్ మిత్రులు రూ.1.27 లక్షలు విరాళాలు అందించి అండగా నిలిచారు. ధర్మపురి పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న నూగురి సత్యనారాయణ గతంలో చిన్న హోటల్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తూ వచ్చాడు. షుగర్ వ్యాధి సోకడంతో 4 ఏళ్ల క్రితం ఒక కాలు తొలగించారు. 3 నెలల క్రితం పక్షవాతం సోకి ఓ చేయి, నడుము పని చేయకపోవడంతో మంచానికే పరిమితమయ్యాడు. బార్య బీడీలు చేస్తూ అతి కష్టం పై కుటుంబాన్ని పోషిస్తుంది. వీరి సమస్య తెలుసుకున్న ధర్మపురి చెందిన సామాజిక సేవకుడు రేణుకంట రమేష్ జూలై 3 న ఫేస్ బుక్ లో పోస్ట్ చేసి, వైద్యం కోసం సాయం కోరాడు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు స్పందించి బాధితుడి భార్య విజయ బ్యాంక్ ఖాతాకు. రూ.1.27 లక్షలు విరాళాలు పంపించారు. వాటిని స్థానిక సీఐ రాం నర్సింహారెడ్డి శుక్రవారం యూనియన్ బ్యాంక్ మేనేజర్ మాధవ రావ్ తో కలిసి పంపిణీ చేశారు. సహాయం అందించడానికి కృషి చేసిన రమేష్ ను సిఐ రాంనర్సింహారెడ్డి తో పాటు పలువురు అభినందించారు.

## కామని లక్ష్మయ్యకు జాతీయ వాగ్దేవి విశేష ప్రతిభా పురస్కారం



**చురకలు ప్రతినిధి కోరుట్ల, జూలై 31 :** కోరుట్ల మండలం జోగిన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితులుగా విధులు నిర్వహిస్తున్న కామని లక్ష్మయ్య జాతీయ స్థాయి వాగ్దేవి విశేష ప్రతిభా పురస్కారం అందుకుని జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. న్యూఢిల్లీ లోని ఆంధ్ర అసోసియేషన్ భవనంలో జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ సి. నారాయణరెడ్డి జయంతి వేడుకల్లో ఈ పురస్కారాన్ని కేంద్ర ఉక్కు, గనుల, భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చేతుల మీదుగా ఆయన స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు బీద మస్తాన్‌రావు, బంగారు లక్ష్మణ్, మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, తిరుమల తిరుపతి దేవస్థానం ప్రవచనకర్త ఆకెళ్ల విభీషణ శర్మ, జాతీయ సాహిత్య పరిషత్ కార్యనిర్వహక అధ్యక్షులు కేశిరాజు రాంప్రసాద్, అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్, తెలుగు భాష చైతన్య సమితి అధ్యక్షుడు బడేసాబ్, ఉద్దంరాజు చైతన్యరాజు, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.జాతీయ పురస్కారం అందుకున్న కామని లక్ష్మయ్యను పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంబటి వెంకట్రాజం, రచయితలు చెరుకు మహేశ్వర శర్మ వాసరవేణి పరశు రాములు ఉపాధ్యాయ సంఘం నాయకులు సహచర ఉపాధ్యాయులు పలువురు విద్యావేత్తలు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## భూ రీ సర్వేతో భూమి సమస్యలకు పరిష్కారం

### -కేశాపూర్‌లో భూ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించిన తహసీల్దార్ వరప్రసాద్



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం జూలై (31) :** భూ రీ సర్వే తో భూమి సమస్యలు పరిష్కారం అవుచాయనీ ఇబ్రహింపట్నం తహశీల్దార్ వరప్రసాద్ అన్నారు.శుక్రవారం ఇబ్రహీంపట్నం మండలంలోని కేశాపూర్ గ్రామంలో భూ సమస్యల పరిష్కారం,భూ రికార్డుల సక్రమ నిర్వహణకు రైతులకు పారదర్శకమైన సేవలు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన భూ రీసర్వే కార్యక్రమాన్ని తహసీల్దార్ వరప్రసాద్ స్థానిక నాయకులు,రైతులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ,భూ రీ సర్వే ద్వారా భూముల హద్దులు ఖచ్చితంగా నిర్ధారించబడటంతో పాటు భూ రికార్డుల్లో ఉన్న లోపాలు సవరించబడతాయన్నారు. భూముల యాజమాన్యానికి సంబంధించిన వివాదాలు తగ్గడంతో రైతులు భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న భూ రీ సర్వే ప్రక్రియ రైతులకు ఎంతో ప్రయోజన కరంగా ఉండటమే కాకుండా భూములకు సంబంధించిన సమాచారాన్ని ఆధునిక పద్ధతుల్లో నమోదు చేసే అవకాశాన్ని కల్పిస్తుందన్నారు.సర్వే నిర్వహణ సమయంలో రైతులు తమ భూ పత్రాలు,పట్టాదారు పాస్ పుస్తకాలు, సంబంధిత ఆధారాలను సిద్ధంగా ఉంచి సర్వే సిబ్బందికి ఇచ్చి సహకరించాలన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ భోనగిరి స్వాతి, మాజీ సర్పంచ్ దాసరి పోశెట్టి, ఉపసర్పంచ్ బజన్నోల శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి రాణి, నాయకులు భోనగిరి భూమేష్, చల్ల పురుషోత్తం, నల్ల నర్సయ్య, దాసరి నర్సయ్య, రైతులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### -వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలి ఆరోగ్య సిబ్బంది సూచన



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం జూలై (31) :** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,ప్రతి కుటుంబం వారంలో ఒకరోజు డ్రైడే పాటించి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ వనజ శుక్రవారం సూచించారు.డాక్టర్ వనజ ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం మండలంలోని గోదూర్, తిమ్మాపూర్, తిమ్మాపూర్ తండా, యామపూర్, ఫకీర్ కొండాపూర్, వేములకుర్తి, బర్దిపూర్, మూలరాంపూర్,ఎర్దండి,కోమటి కొండాపూర్,వర్షకొండ,డబ్బ,అమ్మాపేట్, ఎర్రాపూర్, ఇబ్రహీంపట్నం ,కేశాపూర్, కోజన్ కొత్తూర్ గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీ రమ్య,స్థానిక ఏఎన్‌ఎంలు,ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు.ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని,దోమల నివారణ చర్యలు చేపట్టాలని, తాగు నీటిని మరిగించి వాడాలని, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు.వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రజలు జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. ప్రతి శుక్రవారం లేదా అనుకూలమైన రోజున డ్రైడే నిర్వహించి కూలర్లు, నీటి ట్యాంకులు, పూల కుండీలు తదితర ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## వర్షాకాల ప్రభావంతో వార్డులో సేవా కార్యక్రమాలు

### -సేవలో ముందున్న కోరుట్ల మున్సిపల్ కౌన్సిలర్ పొట్ట సురేందర్



**చురకలు ప్రతినిధి కోరుట్ల జూలై 31 :** కోరుట్ల పట్టణంలోని 16వ వార్డులో కురుస్తున్న వర్షాల ప్రభావంతో పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి పడడంతో పాటు సర్వీస్ విద్యుత్ వైర్లు ఊగిపోవడంతో స్థానికులకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.ఈ విషయాన్ని తెలుసుకున్న 16వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ పొట్ట సురేందర్ వెంటనేస్పందించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి విరిగిన చెట్లకొమ్మలను తొలగించి, ప్రమాదకరంగా ఉన్న సర్వీస్ విద్యుత్ వైర్లను సరి చేయించారు.వార్డు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,వర్షాల సమయంలో ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలని కౌన్సిలర్ పొట్ట సురేందర్ సూచించారు.

# కూలిన ఇంటిని పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

**-ప్రభుత్వ సహాయం అందిస్తామని భరోసా**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూలై 31 :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని రాగట్లపల్లి గ్రామానికి చెందిన గొర్రె మల్లయ్య ఇల్లు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూలిపోవడంతో శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన కుటుంబాన్ని పరామర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని నాయకులు హామీ ఇచ్చారు. డయాలసిస్ పేషంట్‌గా ఉన్న మల్లయ్యకు కిడ్నీ మార్పిడి (ట్రాన్స్‌ప్లాంటేషన్) అవసరమని, ఈ విషయాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్‌తో పాటు సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయం అందించి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని నాయకులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, రాగట్లపల్లి సర్పంచ్ నెతెట్ల లక్ష్మయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూడిద రాజేందర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాడి రామ్ రెడ్డి, నాయకులు సద్ది లక్ష్మారెడ్డి, షేక్ గౌస్, గంట బుచ్చగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ ఘన నివాళి



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూలై 31 :** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నాయకులు పెద్ది సుదర్శన్ రెడ్డి గా ఆకస్మిక గుండెపోటుతో మృతి చెందడం పట్ల రాజన్న సిరిసిల్ల జిల్లా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన కీలక పాత్రను, ఉద్యమ విజయానికి అందించిన సేవలను, పార్టీ బలోపేతానికి చేసిన కృషిని స్మరించుకున్నారు. వారి నిరాడంబర నాయకత్వం, ప్రజాసేవ పట్ల అంకితభావం, ఉద్యమంలో మిగిల్చిన చిరస్మరణీయ జ్ఞాపకాలు ఎల్లప్పుడూ కార్యకర్తలకు స్ఫూర్తిగా నిలుస్తాయని కొనియాడారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పార్టీకి, తీరని లోటని పేర్కొంటూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, రాష్ట్ర నాయకులు గూడూరి ప్రవీణ్, నాయకులు, సెస్ డైరెక్టర్లు వర్స కృష్ణహరి, దార్నాం లక్ష్మినారాయణ, ఫ్యాక్స్ ఛైర్మెన్లు గుండారపు కృష్ణారెడ్డి, బండి దేవదాస్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కుంబాల మల్లారెడ్డి, గజభింకర్ రాజన్న, ఆకుల చిన్న, సంపత్, హరీష్, శ్రీనివాస్, అక్రమ్ అశోక్ రావు, సత్యనారాయణ, అజయ్, బాలకిషన్ కార్యకర్తలు పాల్గొని పెద్ది సుదర్శన్ రెడ్డి గారికి ఘనంగా నివాళు లర్పించారు.

# వర్షాకాలంలో విద్యుత్ భద్రత పాటించాలి

**-ఏ ఈ తూర్పాటి స్వామి**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూలై 31 :** విద్యుత్ వినియోగదారులు వర్షాకాలంలో జాగ్రత్తలు పాటించాలి అని కమాన్ పూర్ ఎన్ పి డి సి ఎల్ సెక్షన్ ఏఈ తూర్పాటి స్వామి అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మీ అప్రమత్తతే మీ రక్షణ... మీ కుటుంబ భద్రత అందరి లక్ష్యం అని అన్నారు. వర్షా కాలంలో ప్రతి వినియోగదారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన వివరించారు. తడి చేతులతో ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ ముట్టుకో రాదని తెగిపోయిన విద్యుత్ తీగలు కనిపిస్తే, వాటికి దూరంధోద్ద ఉండి వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు. విద్యుత్ స్తంభాల వద్ద ట్రాన్స్ఫార్మర్ల కు దూరంగా ఉండాలని సర్వీస్ వైర్ తెగిపడితే ముట్టుకో రాదని సూచించారు. ప్రతి ఇంటికి ఎర్త్ వైర్ తప్పకుండా పెట్టుకోవాలని అటువంటి సమయంలో ప్రమాదాలు జరుగవని అన్నారు. ఏదైనా విద్యుత్ పరికరాలు నీటిలో పడి ఉన్న సమయంలో వాటిని ముట్ట రాదని దానికి దూరంగా ఉండాలని అన్నారు. వర్షం పడే సమయంలో విద్యుత్ తీగల కు పచ్చి చెట్లు తాగితే దూరంగా ఉండాలని అలాగే వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని అన్నారు. చిన్న పిల్లలను విద్యుత్ పరికరాలకు, వైరు దూరంగా ఉంచాలని కోరారు. విద్యుత్ సంబంధిత అత్యవసర పరిస్థితల్లో వెంటనే సమీప విద్యుత్ కార్యాలయానికి లేదా టోల్ ఫ్రీ 1912 కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రతి వినియోగదారులు సలహాలు సూచనలు పాటించాలని అన్నారు.

# నిర్మల్ జిల్లాలో ఆగస్టు 1 నుంచి సెక్షన్-30 అమలు



**చురకలు ప్రతినిధి, నిర్మల్, జూలై, 31 :** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా ప్రశాంతతను దృష్టిలో ఉంచుకుని 01 ఆగస్టు 2026 నుండి 31 ఆగస్టు 2026 వరకు నిర్మల్ జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ సెక్షన్--30 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ. జానకి షర్మిల ఒక ప్రకటనలో తెలిపారు. సెక్షన్--30 అమలులో ఉన్న కాలంలో సంబంధిత పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, బహిరంగ సభలు, సమావేశాలు లేదా పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనే కార్యక్రమాలు నిర్వహించరాదని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించి ప్రజా శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరించిన వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా, సోషల్ మీడియా వేదికల ద్వారా తప్పుడు ప్రచారం, వదంతులు, మత విద్వేషాలు లేదా సామాజిక ఉద్రిక్తతలకు దారితీసే పోస్టులు, వీడియోలు, సందేశాలు ప్రసారం చేసిన వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు చట్టాన్ని గౌరవించి పోలీసు శాఖకు సహకరించాలని, సభలు, సమావేశాలు లేదా ఇతర బహిరంగ కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటే సంబంధిత పోలీసు అధికారుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా పొందాలని జిల్లా ఎస్పీ సూచించారు. జిల్లా శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

## రిటైర్డ్ కార్మికునికి ఘన సన్మానం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూలై 31 :** సింగరేణి సంస్థ రామగుండం రీజియన్ 2 వర్క్ షాప్ లో పనిచేసి పదవీ విరమణ పొందిన కార్మికునికి శుక్రవారం ఘన సన్మానం చేశారు. ఆర్ జి -2 ఏరియా వర్క్ షాప్ ఐ ఎన్ టి యు సి పిట్ సెక్రటరీ వంగ సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో పదవి విరమణ సన్మానం ఘనంగా నిర్వహించారు. ఆర్జి 2 ఏరియా వర్క్ షాప్ లో ఫిట్టర్ గా మరియు యాక్టింగ్ చార్జెండ్ గా విధులు నిర్వహిస్తూ పదవి విరమణ పొందినటువంటి ధరణి మల్లేశ్వరరావు కి తోటి కార్మికులు ఐఎన్టీయూసీ నాయకులు ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి నాయకులు భూక్య సైదులు, అనుమ రాయమల్లు, ప్రవీణ్ కుమార్ వాసుదేవరెడ్డి రవీందర్ రాజేష్ శ్రీనివాస్ మల్లేష్ మతిన్ ఖాన్ (మురాద్ ఖాన్)సంపత్ శ్రీనివాస్ సురేష్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మంథని స్వర్ణకార సంఘం అధ్యక్షుడిని సన్మానించిన బీసీ సంక్షేమ సంఘం

**చురకలు ప్రతినిధి, మంథని, జూలై 31 :** మంథని పట్టణ స్వర్ణకారసంఘం నూతన అధ్యక్షునిగా ఎన్నికైన వంగల తిరుమలేష్‌ని శుక్రవారం మంథని పట్టణం లో జాతీయ బీసీసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రకార్యదర్శి పెండ్యాల రామ్ కుమార్, స్వర్ణకార సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుండుజు ప్రవీణ్‌కుమార్‌లు శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. స్వర్ణకార సంఘం అభివృద్ధికి, సంఘ సభ్యుల అభ్యున్నతికి పాటుపడాలని నూతన అధ్యక్షుడు తిరుమలేష్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకారసంఘం నాయకుడు సిరికొండ నాగన్న, పెండ్యాల శ్రీనిధి, సిరికొండ శివమణిలతోపాటు పలువురు పాల్గొన్నారు.

## నూతన అధ్యక్షుడిని సన్మానం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (మంథని), జూలై 31 :** మంథని పట్టణ స్వర్ణకార సంఘం నూతన అధ్యక్షునిగా ఎన్నికైన వంగల తిరుమలేష్ ని శుక్రవారం మంథని పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి పెండ్యాల రామ్ కుమార్, స్వర్ణకార సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుండుజు ప్రవీణ్ కుమార్ లు శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. స్వర్ణకార సంఘం అభివృద్ధికి, సంఘ సభ్యుల అభ్యున్నతికి పాటుపడాలని నూతన అధ్యక్షుడు తిరుమలేష్ ను కోరారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం నాయకుడు సిరికొండ నాగన్న, పెండ్యాల శ్రీనిధి, సిరికొండ శివమణి లతోపాటు పలువురు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి గుడిలో అన్న ప్రసాద వితరణ



**చురకలు విలేఖరి వీణవంక జూలై 31 :** వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలోని పెద్దమ్మ తల్లి దేవాలయంలో అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వారి ఆధ్వర్యంలో 77వ శుక్రవారం తాటిపెల్లి అజయ్ 25వ జన్మదినం పురస్కరించుకొని అన్నప్రసాద వితరణ చేశారు. అమ్మ ఫౌండేషన్ అధ్యక్షులు గోనెల సమ్మన్న అద్యక్షులు, కర్రె స్వామి, నిమ్మల మల్లన్న, దూలం వెంకటేష్, నిమ్మల రమేశ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దశదిన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూలై 31 :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు సహోదరి,మంథని మాజీ సర్పంచ్ స్వర్గీయ సువర్ణ చంటయ్య సతీమణి,మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మరియు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు మేనత్త స్వర్గీయ సువర్ణ వనమాల దశదినకర్మ కార్యక్రమం ఈరోజు మంథని పట్టణంలో జరిగింది.ఈ సందర్భంగా సువర్ణ వనమాల చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించిన కమాన్‌పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్ ఎస్ అన్వర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అబీర్ శ్రీనివాస్, ఇనగంటి చిన్నారావు తదితరులు పాల్గొని స్వర్గీయ సువర్ణ వనమాల చిత్రపటానికి పూలతో నివాళులర్పించి, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## కళాశాల ప్రిన్సిపాల్ రాజిరెడ్డికి ఘన వీడ్కోలు



**చురకలు విలేఖరి వీణవంక,జూలై 31 :** ప్రభుత్వ జూనియర్ కళాశాల, వీణవంక ప్రిన్సిపాల్ కె.రాజిరెడ్డి పదవీ విరమణ సందర్భంగా శనివారం కళాశాల అధ్యాపకుల ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ.. రాజిరెడ్డి తో కలిసి పనిచేసిన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ఆయన నిరాడంబర వ్యక్తిత్వం, క్రమశిక్షణ, విద్యార్థుల పట్ల చూపిన ఆప్యాయత, సహోద్యోగులతో సత్సంబంధాలు, విద్యారంగ అభివృద్ధికి అందించిన విశిష్ట సేవలను కొనియాడారు.ఆయన సేవలు కళాశాల అభివృద్ధికి చిరస్మరణీయమని పేర్కొంటూ ఘనంగా సత్కరించి శాలువా, జ్ఞాపిక అందజేశారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రవీందర్, గ్రంథపాలకుడు రామ్మోహన్,కతెరశాల జైపాల్ రెడ్డి,శోభన్ బాబు, కల్పన,కరుణ,సుమలత, స్వప్న,శైలజ,తాజుద్దీన్, జమీల్,రాజశేఖర్ లు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 1లోపు పిఆర్‌సీ అమలు చేయాలి

**-పిఆర్‌టియుటిఎస్ జగిత్యాల జిల్లా శాఖ**



**చురకలు విలేఖరి,జగిత్యాల,జూలై 31 :** సి పి ఎస్ రద్దు, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడం, అలాగే 2వ పిఆర్సి ను అమలు చేయడం వంటి ప్రధాన డిమాండ్లను 2026 సెప్టెంబర్ 1లోపు ప్రభుత్వం అమలు చేయాలని,లేనిపక్షంలో పిఆర్‌టియు టిఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయినిపెల్లి ఆనంద్‌రావు యాల్ల అమర్నాథ్ రెడ్డి అన్నారు ఈరోజు కోరుట్ల పట్టణంలోని ప్రాథమిక పాఠశాల అల్లమయ్య గుట్ట లో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్న సెకండరీ గ్రేడు ఉపాధ్యాయులు సోమ గంగాధర్ గారి సన్మానమహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైవారు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించకపోతే సెప్టెంబర్ 1నాడు ఇందిరా పార్క్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపడతామని వారన్నారు అనంతరం సోమ గంగాధర్ గారి సేవలను కొనియాడారు గంగాధర్ ను ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామకృష్ణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఆనందరావు జ్యోష్న గంగాధర్ కోరుట్ల పట్టణ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ వాజిద్ నవీన్  ధరమ్ దీప్ శేఖర్ శశాంక్ శ్రీనివాస్ ఉపేందర్ హరనాథ్ జ్యోతి భవాని రాధ తదితరులు పాల్గొన్నారు.

### ఇది పక్కా కుంభకోణం,

# ఎమ్మెల్యేకు దమ్ముంటే విజిలెన్స్ విచారణ జరిపించాలి...!

**-మీ అందరి అవినీతి బయట పెడతా**

**-ఆధారాలన్ని సిబిఐకి,ఈడీకి ఇస్తా**

**-మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేత సురేష్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి,సుల్తానాబాద్ జూలై 31 :** పెద్దపల్లిలో వడ్ల కొనుగోలు ,బియ్యం సేకరణ.. తరలింపులో అక్రమాలు వెలుగులోకి తెస్తా.ఈ కుంభకోణం గురించి ఎమ్మెల్యేకు తెలియదా?దమ్ము ఉంటే,నిజాయతీ ఉంటే విజిలెన్స్ విచారణ చేయాలి.. రైతులను నిండా ముంచి వందల కోట్లు వెనకేసుకున్న రైస్ మిల్లులపై బీజేపీ నేత సురేష్ రెడ్డి శుక్రవారం మరోసారి నిప్పులు చెరిగారు. ఇటీవల పెద్దపల్లిలో ధాన్యం కొనుగోళ్లు, సీఎంఆర్ ధాన్యం తరలింపు అంశంలో 700 కోట్ల స్కామ్ జరిగిందని ఆధారాలతో సహా బయట పెట్టిన సురేష్ రెడ్డి తాజాగా కొన్ని రైస్ మిల్లులపై మళ్ళీ సంచలన ఆరోపణలు చేశారు. తనకు అవగాహన లేదంటూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన రైస్ మిల్ అసోసియేషన్ సభ్యులపై సురేష్ రెడ్డి నిప్పులు ఘాటు గా విమర్శలు చేశారు.. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు మీద రైస్ మిల్లర్లకు ప్రేమ ఉంటే.. రైతులను నిండా ముంచుతారా అని ప్రశ్నించారు.సివిల్‌సప్లై అధికారులు , రైస్ మిల్లర్లు, గోదాం నిర్వాహకులు చేసిన అవినీతిని తాను బయట పెడితే కొందరు రైస్ మిల్లర్లకు ఎందుకంత నొప్పి అంటూ ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యే విజయ రమణారావుకు దమ్ముంటే పెద్దపల్లి నియోజకవర్గంలోని రైస్ మిల్లుల్లో జరిగిన కుంభకోణాలపై విజిలెన్స్ ఎంక్వైరీ నిర్వహించి దొంగల పై కఠిన చర్యలు తీసుకునే దమ్ముందా అని సవాల్ విసిరారు. ఇటీవల 700 కోట్ల హమాలీ చార్జీల కుంభకోణంపై తాను బయటపెట్టిన ఆధారాలను చూసి గోదాం నిర్వాహకులు, అధికారులు, రైస్ మిల్లర్లలో వణుకు పుట్టిందని అన్నారు.

**రైతుల మధ్య చర్చకు వెళ్దామా?**

పెద్దపల్లి నియోజకవర్గంలో కొనుగోలు జరిపిన మొదటి రోజు మాత్రమే బస్తాకు నలభై కిలోలు తూకం వేశారని,రెండో రోజు నుంచి ఒక బస్తాకు రెండు కిలోలు అదనంగా తూకం వేశారని సురేష్ రెడ్డి విమర్శించారు.పెద్దపల్లి నియోజక వర్గంలో ధాన్యం కొనుగోళ్లలో రైతులను నిండా ముంచలేదంటూ ఎమ్మెల్యే సహా కొందరు రైస్ మిల్లర్లు పబ్లిసిటీ చేస్తున్నారని,కానీ రెండో రోజు నుంచే క్వింటాలకు మూడు నాలుగు కిలోలు అదనంగా తూకం వేసి రైతులను నిండా ముంచారని తన దగ్గర వీడియోలు కూడా ఉన్నాయని సురేష్ రెడ్డి అన్నారు. ఓవైపు రైతులను మరోవైపు ప్రభుత్వాన్ని నిండా ముంచి డబ్బులను ఎక్కడెక్కడ కొందరు రైస్ మిల్లర్లు పెట్టుబడులు పెట్టారో తనకు తెలుసు అని అన్నారు. ఎమ్మెల్యే కు వకల్తా పుచ్చుకొని కొందరు రైస్ మిల్లర్లు మాట్లాడటం సిగ్గుచేటని తెలిపారు.ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరగలేదని రైతుల దగ్గర అదనపు తూకం వేయలేదని రైస్ మిల్లర్ అసోసియేషన్ సభ్యులు నిరూపించ గలరా అంటూ సవాల్ విసిరారు. రైస్ మిల్ అసోసియేషన్ లోని ఓ ముఖ్య సభ్యుడి గ్రామానికి వెళ్దామని అక్కడి రైతుల మధ్యలే చర్చ పెడదామని సవాల్ విసిరారు.రాజకీయాల్లోకి తాను దొంగ దందాలు చేయడానికి రాలేదని తనతో ఎమ్మెల్యే లాగా రహస్య డీల్స్ చేద్దాం అంటే కుదరదు అని సురేష్ రెడ్డి అన్నారు.పెద్దపల్లి నియోజకవర్గంలో జరిగిన ధాన్యం కుంభకోణంపై త్వరలోనే సిబిఐ,ఈడీని కలుస్తానని, ఆధారాలతో సహా కుంభకోణాన్ని బట్ట బయలు చేసి చర్యలు తీసుకునే వరకు పోరాడుతానని సురేష్ రెడ్డి అన్నారు. ధాన్యం కుంభకోణం విషయంలో కానీ రైతుల విషయంలో తన జోలికి వస్తే రోజుకు ఆధారంతో ప్రజల ముందుకు వస్తానంటూ హెచ్చరించారు.

**ఎమ్మెల్యేకు దమ్ముందా**

ఎమ్మెల్యే విజయరమణారావుకు దమ్ముంటే పెద్దపల్లి లో జరిగిన అనేక అవకతవకలపై విజిలెన్స్ విచారణకు ఆదేశాలు ఇచ్చేలా ప్రభుత్వాన్ని కోరాలని సవాలు విసిరారు. త్వరలోనే మరో ఆధారంతో ప్రజల ముందుకు వస్తానని సురేష్ రెడ్డి అన్నారు.ఈకార్యక్రమంలో సుల్తానాబాద్ మండల బీజేపీ అధ్యక్షులు కందుల శ్రీనివాస్, ప్రధానకార్యదర్శులు కోట నాగేశ్వర్, కొల్లూరి సంతోష్ కుమార్, కొమ్మిడి రాజేందర్ రెడ్డి, బండారి లత,ఎర్రం సంతోష్ రెడ్డి,మల్క భాగ్యలక్ష్మి, వలస సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల వొడితల సతీష్ కుమార్ దిగ్భ్రాంతి

**-గొప్ప ప్రజా నాయకుడిని కోల్పోయాం**

**- 'పెద్ది' మరణం తెలంగాణ ఉద్యమానికి తీరని లోటు**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ జూలై 31 :** హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే  వొడితల సతీష్ కుమార్ ఉమ్మడి వరంగల్ జిల్లా టీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి  మరణం పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, "పెద్ది సుదర్శన్ రెడ్డి తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాడిన ధీశాలి నాయకుడు. ఉద్యమ స్ఫూర్తిని గ్రామీణ స్థాయి వరకు తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారు. ప్రజల కోసం,తెలంగాణ కోసం ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయి"అని అన్నారు. అనారోగ్యంతో ఆయన మరణించడం అత్యంత బాధాకరమని పేర్కొంటూ, తనతో ఉన్న సుదీర్ఘ రాజకీయ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన పోషించిన పాత్రను ఎన్నటికీ మరువలేమని అన్నారు.ప్రజా జీవితంలో నిబద్ధత, నిరాడంబరత, ఉద్యమ పట్ల అంకితభావంతో పనిచేసిన పెద్ది సుదర్శన్‌రెడ్డి సేవలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి గారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబసభ్యులకు, అభిమానులకు ,అనుచరులకు తనప్రగాఢ సానుభూతిని తెలియజేశారు."పెద్ది సుదర్శన్ రెడ్డి గారి ఆశయాలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి" అని వొడితల సతీష్‌కుమార్ అన్నారు.

# మహిళ మృతికి కారణమైన ఇటుక

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట జూలై 31 :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఐదేళ్ల క్రితం జరిగిన ఓ ఇంటి నిర్మాణపనుల్లో జరిగిన ప్రమాదం ఓ మహిళ ప్రాణాలను బలిగొన్న విషాద ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.స్థానికుల వివరాల ప్రకారం, 2021లో ఓ పంచాయతీ కార్యదర్శికి చెందిన బిల్డింగ్ నిర్మాణపనులు జరుగుతున్న సమయంలో  మట్టి ఇటుక బిల్డింగ్ పక్కన వంటపాత్రలు శుభ్రం చేస్తుండగా ప్రమాద వశత్తు ఉప్పుల నరసవ్వ తలపైపడింది.ఈ ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడింది అప్పటి నుండి చనిపోయంత వరకు వివిధ ఆసుపత్రులకు చికిత్స కొరకు పంపిన నయం కాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు.గత ఐదేళ్లుగా మంచానికే పరిమితమైన నరసవ్వ చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడినా ఫలితం లేకపోగా గురువారం కన్నుమూశారు.ఆమె మృతితో కుటుంబ సభ్యులు,బంధువులు శోకసముద్ర మయ్యారు.దీంతో విషాదం అలుముకుంది.అయితే, ప్రమాదానికి ఇంటి నిర్మాణంలో జరిగిన నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు



ఆరోపిస్తున్నారు.ఘటనపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బిల్డింగ్ యజమాని పై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# సర్ దరఖాస్తులలో తప్పులతో ఓటర్లకు ఇబ్బందులు

**-కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన మాజీ కౌన్సిలర్ జయశ్రీ**

**చురకలు విలేకరి, జగిత్యాల, జూలై 31 :** జగిత్యాల జిల్లాలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో పలు లోపాలు ఉన్నాయని మాజీ కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. బిఎల్ఓల ద్వారా ఓటర్ల నుండి దరఖాస్తులు



తీసుకున్నప్పటికీ అవి ఆన్‌లైన్‌లో ఎంట్రీ కావడం లేదని, కొన్ని దరఖాస్తులు మిస్ అవుతున్నాయని ఆమె ఆరోపించారు. దీంతో అధికారులు మళ్లీ మళ్లీ దరఖాస్తులు అడగడంతో ఓటర్లు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సమయం దగ్గర పడటం, 2002 సంవత్సరం వివరాలు గుర్తు లేక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆన్‌లైన్ మ్యాపింగ్‌లోనూ తప్పులు జరుగుతున్నాయని, ఓటర్ కుటుంబానికి సంబంధించిన బిఎల్‌ఓవద్ద కాకుండా వేరే గ్రామాల, పట్టణాల బిఎల్‌ఓల వద్ద మ్యాపింగ్ అవుతుండటంతో స్థానికంగా పేర్లు కనిపించక సమస్యలు వస్తున్నాయన్నారు.ఈ విషయమై సంబంధిత బిఎల్‌ఓలకు ఫోన్ చేసినా స్పందించడం లేదని, దీంతో ఓటర్లు అయోమయానికి గురవుతున్నారని వినతిలో పేర్కొన్నారు. ప్రతి ఓటర్ దరఖాస్తును వెంటనే ఆన్‌లైన్ చేసి, మ్యాపింగ్‌ను ఓటర్ పేరు ఉన్న బూతులోనే,వారి కుటుంబ బిఎల్ఓ వద్దనే జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆమె కలెక్టర్‌ను కోరారు.

# తహాఫుజ్ ఖత్మే నబువ్వత్‌ను సమాజంలో బలోపేతం చేయండి

**-ఇస్లాం ముసుగులో సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలపై అప్రమత్తంగా ఉండండి**
**-ముస్లిం సమాజానికి మౌలానా అర్షద్ అలీ ఖాస్మి పిలుపు**

**చురకలు విలేకరి, కరీంనగర్, జూలై 31 :** ప్రస్తుత పరిస్థితుల్లో ఖాధియాని,షకిలియత్ వర్గాల నుంచి ముస్లిం సమాజాన్ని మేలుకొలుపి,వారి బారి నుండి కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఉమ్మతే మహమ్మదీయా (మహమ్మద్ ప్రవక్త సల్లం అనుచరులపై) ఉందని మజ్లీస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ ట్రస్టు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి మౌలానా అర్షద్ అలీ ఖాస్మి పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా మజ్లీస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్టు అధ్యక్షుడు ముఫ్తి మహమ్మద్ ఫియాస్ మొహియుద్దీన్ ఆధ్వర్యంలో కశ్మీర్ గడ్డ మస్జిదే జంజంలో నిర్వహించిన ఇస్ దౌర్ మే బాతిల్ ఫిత్నోసే అప్నే ఈమాన్ కో కైసే బచాయే అనే అంశంపై నిర్వహించిన జల్సా ఆధ్యాత్మిక సదస్సు పెద్దఎత్తున విజయవంతం అయింది.ఈసందర్భంగా మౌలానా అర్షద్‌అలీ ఖాస్మి మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్తను చిట్ట చివరి ప్రవక్తగా అంగీకరించకుంటే ముస్లిం కాలేదని,విశ్వాసం ఈమాన్ నుండి బహిష్కృతులు అవుతారని చెప్పారు.ఇజ్రాయిల్,ఆంగ్లేయుల కనుసన్నల్లో భారతదేశంలో ఖాధియాని వర్గం పేరిట,షకిల్ వర్గం పేరిట కార్యకలాపాలను కొనసాగిస్తూ, ముస్లింల ముసుగులో, వేషధారణలతో అమాయక ముస్లింలను మోసం చేస్తున్నారని ఆరోపించారు.ముస్లిం యువత ఇస్లాం గురించి పూర్తి స్థాయిలో తెలియకుండా ఖాధియాని,షకిలియత్ వర్గాలు ముస్లిం గురువులు, పండితులని నమ్మి, వారిబారిన పడి,ఇస్లాం,ఈమాన్ నుండి తమంతట తాము బహిష్కృతులు అవుతున్నారని,ఇంత పెద్ద ఘటన ఇది వీరికి తెలియకుండానే జరిగిపోతుందన్నారు.ఖాధియాని,షకిలియత్ వర్గాలను స్వీకరించి,వారు చెప్పిన బాటలో



నడుస్తూ జీవితం గడిపి,ఒకవేళ మరణిస్తే కాఫీర్ గానే పరిగణించబడుతారని, ఖయామత్ ప్రళయదినం రోజు లేపబడుతారని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ముస్లింలను చేరదీసి, వారి ఈమాన్ విశ్వసాన్ని కాపాడేందుకు మజ్లీస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్టు చేస్తున్న ఈ బృహత్తర యజ్ఞంలో ప్రతి ఒక్కరూ తమ విధిగా, బాధ్యతతో పాలుపంచుకొని, తోడ్పాటునందించాలని కోరారు.ముఫ్తి ఫియాస్ మొహియుద్దీన్ కరీంనగర్ ఉమ్మడిజిల్లాలో అలుపెరుగకుండా గ్రామీణ ప్రాంతాల్లో ముస్లింల,ఈమాన్, విశ్వసాన్ని కాపాడేందుకు కృషి చేస్తున్నారని అభినందించారు. ముఫ్తి ఫియాస్ మొహియుద్దీన్ కు కరీంనగర్ నగర ముస్లిం సమాజం అండగా నిలబడి,మజ్లీస్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్టులో తమ అమూల్యమైన సమయాన్ని వెచ్చించి,అమాయక గ్రామీణ ముస్లింలను ఇస్లాం నుండి మరలిపోకుండా కాపాడే యజ్ఞంలో మహమ్మద్ ప్రవక్త అనుచరులుగా మనసా, వాచా, ఖర్మనా సేవలు అందించాలని పిలుపు నిచ్చారు. ఈసదస్సుకు ఉమ్మడి జిల్లా నుండి, నగర ఇస్లామీయ ధార్మిక పండితులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేశారు. ఈకార్యక్రమంలో హాఫీజ్ వసిముద్దీన్, ఖత్మే నబువ్వత్ కరీంనగర్ సేవకులు హాఫిజ్ అహ్మద్ హిఫ్జి, కలిమ్ షరీఫ్, హాఫిజ్ అబ్దుల్ రాఫె, హాఫిజ్ తౌహీద్, హాఫీజ్ ఇమ్రాన్ బేగ్, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి మృతిపట్ల బోయినపల్లి వినోద్ కుమార్ దిగ్భ్రాంతి

**-మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కన్నీళ్ల పర్యంతం**

**చురకలు ప్రతినిధి కరీంనగర్ జూలై 31 :** ఉమ్మడి వరంగల్ జిల్లా టిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి చెందడం పట్ల మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.పెద్ది సుదర్శన్ పెద్ది సుదర్శన్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసి వినోద్ కుమార్ కన్నీళ్ల పర్యంతమయ్యారు. పెద్ది సుదర్శన్ రెడ్డితో ఉన్న అనుబంధాన్ని వినోద్ కుమార్ నెమరు వేసుకుంటూ ఈ బాధ నుంచి కోలుకోలేని స్థితికి చేరుకున్నారు.ఈ సందర్భంగా బోయినపల్లి వినోద్ కుమార్



మాట్లాడుతూ ఒక ప్రజా నాయకుడిని, తెలంగాణ ఉద్యమకారుడిని కోల్పోయామని బాధను వ్యక్తం చేశారు. నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న పెద్ది సుదర్శన్ రెడ్డి టిఆర్ఎస్ పార్టీ అధినేత కేసిఆర్ నేతృత్వంలో 2001 లో టిఆర్ఎస్ పార్టీలో చేరారని వినోద్ కుమార్ తెలిపారు. 2001లో జెడ్పిటిసి ఎన్నికల సందర్భంగా ప్రొఫెసర్ బియ్యాల జనార్దన్ రావు ,సీనియర్ న్యాయవాది సహోదరు రెడ్డిలో టిఆర్ఎస్ పార్టీ నుంచి నల్లబెల్లి జడ్పిటిసి మెంబర్గా పోటీ చేయమని కోరగా ఏ మాత్రం ఆలోచించకుండా కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి టిఆర్ఎస్ లో చేరి రైతు నాగలి గుర్తుపై అప్పటి టిడిపి నాయకుడు ప్రస్తుత రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి పై సుదర్శన్ రెడ్డి గెలుపొందారు అని వినోద్ కుమార్ పేర్కొన్నారు.2004 పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో టిఆర్ఎస్ పార్టీ బలోపేతం కోసం పెద్ది సుదర్శన్ రెడ్డి కృషి చేశారని,2006 లో జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్‌గా ఎన్నికయ్యారని ఆయన చురుకైన పాత్రను గుర్తించి కేసీఆర్ జిల్లా అధ్యక్షుడిగా నియమించారని వినోద్ కుమార్ తెలిపారు. 2018 లో నర్సంపేట ఎమ్మెల్యేగా పొందిన ప్రతి సుదర్శన్ రెడ్డి నియోజక వర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేశారని దేవాదుల నీళ్లను పాకాల రామప్ప చెరువులను నింపడం ద్వారా వేలాది ఎకరాల భూములను సాగులోకి తీసుకువచ్చే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ను ఒప్పించారని వినోద్ కుమార్ వివరించారు. సీఎం కేసీఆర్ మెడికల్ కాలేజీలను జిల్లాకు ఒకటి ప్రకటించిన నేపథ్యంలో ఆ కాలేజీలో నర్సంపేటలో ఏర్పాటు చేసే విధంగా పెద్ది సుదర్శన్ రెడ్డి కృషి చేశారని ప్రతిరోజు కనీసం 200 కిలోమీటర్లు ప్రయాణించే శక్తి ఉన్న గొప్ప నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి మన మధ్య లేకపోవడం చాలా చాలా బాధాకరం అని వినోద్ కుమార్ అన్నారు.

## కేజీబీవీలో ఆషాఢ గోరింటాకు వేడుకలు



**చురకలు విలేకరి, గొల్లపల్లి, జూలై 31 :** గొల్లపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గొల్లపల్లి మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని నిర్వహించిన గోరింటాకు సంబరాలు అత్యంత వైభవంగా శుక్రవారం జరిగాయి. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో విద్యార్థినులు,ఉపాధ్యాయులు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు ఒకరికొకరు రకరకాల ఆకర్షణీయమైన డిజైన్లలో గోరింటాకు పెట్టుకుంటూ సందడి చేయడంతో పాఠశాల ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది.లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బొమ్మెకుమార్ మాట్లాడుతూ సమాజ సేవే ధ్యేయంగా పనిచేసే లయన్స్ క్లబ్, మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవడంలోనూ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు.విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు,వారిలో ఆనందాన్ని నింపేందుకు ఇటువంటి సంబరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ పద్మ మాట్లాడుతూ విద్యార్థినులకు చదువుతో పాటు మన ఆచార వ్యవహారాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కేజీబీవీ బాలికల కోసం ప్రత్యేకంగా ప్రేరణనిచ్చే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన లయన్స్ క్లబ్ ప్రతినిధులకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, పాటలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, కేజీబీవీ ఉపాధ్యాయులు,సిబ్బంది,విద్యార్థినులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుదారులు ఈ-కేవైసీ గడువు పొడిగింపును సద్వినియోగం చేసుకోవాలి

**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ జులై 31 :** రేషన్ కార్డుదారుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం ఈ-కేవైసీ పూర్తి చేసే గడువును ఆగస్టు 31, 2026వరకు పొడిగించడం అభినందనీయమని మానకొండూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అరవింద్ తోర్తి పేర్కొన్నారు.రాష్ట్రంలో కొనసాగుతున్న వర్షాలు, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తీసుకున్న ఈ



నిర్ణయం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.ఇంకా ఈ-కేవైసీ పూర్తి చేయని రేషన్ కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా తమ ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని కోరారు.అలాగే, ఆగస్టు 1 నుండి 31 వరకు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయనున్నందున లబ్ధిదారులు తమకు సమీపంలోని చౌకధరల దుకాణంలో రేషన్‌ను సకాలంలో పొందాలని సూచించారు.ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని,ఎలాంటి అపోహలకు తావివ్వకుండా అధికారుల సూచనలను పాటించాలని తోర్తి అరవింద్ విజ్ఞప్తి చేశారు.

## గొల్లపెల్లి క్రీడాకారులను అభినందించిన సర్పంచ్ కొండ రమేష్ గౌడ్




**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట జూలై 31 :** ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన క్రీడా పోటీల్లో జిల్లా స్థాయిలో గెలుపొంది రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన ఎల్లారెడ్డి పేట మండలం గొల్లపెల్లి క్రీడాకారులను సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ అభినందించారు.రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొంది గొల్లపల్లి గ్రామాన్ని జాతీయస్థాయిలో నిలబెట్టాలని కోరారు.ఈ సందర్భంగా క్రీడ పోటీల్లో పాల్గొనడానికి వెళ్లే 11 మందికి టీ షర్టులను తన సొంత ఖర్చులతో అందజేయన్నట్లు సర్పంచ్ రమేష్ గౌడ్ హామీ ఇచ్చారు.

# సంచలనాత్మక ఇంటి దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు

**-బాధితుడి అల్లుడు, మనవడే ప్రధాన సూత్రధారులు**
**-మీరట్‌కు చెందిన ముగ్గురు నిందితుల అరెస్ట్**
**-నగదు, బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం**




**చురకలు ప్రతినిధి కరీంనగర్ జూలై 31 :** కరీంనగర్‌లోని భగత్‌నగర్ లో నివాసముంటున్న 80 సంవత్సరాల వయస్సు గల శ్రీ ఎం.డి.అజ్మత్ అలీ ఇంట్లో 21/22.07.2026 మధ్య రాత్రి జరిగిన సంచలనాత్మక ఇంటి దోపిడీ కేసును కరీంనగర్ పోలీసులు విజయవంతంగా ఛేదించారు.దర్యాప్తులో బాధితుడి అల్లుడు మొహమ్మద్ రాజావుద్దీన్ (A1),మనవడు మొహమ్మద్ అజీమ్ రజా (A2) ఈ నేరానికి ప్రధాన కుట్రదారులు/సూత్రధారులుగా ఉన్నట్లు వెల్లడైంది. వీరిద్దరు మరో ముగ్గురి నిందితులను కలుపుకుని ఈ దోపిడీకి పాల్పడ్డారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మీరట్‌కు చెందిన వారి ముగ్గురు సహచరులను మీరట్ పోలీసుల సహకారంతో కరీంనగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.వారినుండి నిందితులు A3 సల్మాన్,A4 సల్మాన్,A5 హసీన్ వద్ద నుంచి రూ.2,09,000/- నగదు,43.67 గ్రాముల బంగారు ఆభరణాలు,64.98 గ్రాముల వెండి ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**కేసు సంక్షిప్త వివరాలు**

21/22.07.2026 మధ్య రాత్రి డమ్మీ పిస్టల్స్, కత్తులతో వచ్చిన నిందితుల ముఠా కరీంనగర్ భగత్‌నగర్ లోని ఎం.డి.అజ్మత్ అలీ నివాసంలోకి బలవంతంగా ప్రవేశించింది. నిందితులు ఇంట్లో ఉన్న వారిని కత్తులు, డమ్మీ పిస్టల్స్‌తో బెదిరించి,వారి చేతులు, కాళ్లు కట్టి నిర్బంధించి,ఇంట్లోని నగదు, బంగారు,వెండి ఆభరణాలు,మొబైల్ ఫోన్లను దోచుకెళ్లారు.అక్కడి నుంచి పారిపోతున్న సమయంలో ఆ ఇంటి ప్రాంగణంలో నివాసముంటున్న అద్దెదారులకు చెందిన రెండు మోటార్ సైకిళ్లను కూడా తీసుకెళ్లారు.బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు వెంటనే సమగ్ర దర్యాప్తు చేపట్టారు.

**ప్రత్యేక పోలీసు బృందాల ఏర్పాటు**

నేర తీవ్రత, సంచలనాత్మక స్వభావాన్ని పరిగణనలోకి తీసుకుని కరీంనగర్ పోలీస్ కమిషనర్‌తో పాటు అదనపు డీసీపీ, ఏసీపీలు మరియు ఇతర సీనియర్ పోలీసు అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి ప్రాథమిక దర్యాప్తును పర్యవేక్షించారు. సీసీటీవీ ఫుటేజీల పరిశీలన, సాంకేతిక మరియు డిజిటల్ ఆధారాల సేకరణ, విశ్లేషణ,నిందితులు పారిపోయిన మార్గాన్ని గుర్తించడం,అనుమానిత వ్యక్తులు మరియు వారి కదలికలను పరిశీలించడం,నిందితులను పట్టుకోవడం కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు.

**కీలక ఆధారాలు అందించిన డిజిటల్ సాక్ష్యాలు**

దర్యాప్తులో భాగంగా నిందితులు పారిపోయిన మార్గంలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన డిజిటల్, సాంకేతిక ఆధారాలను పోలీసులు క్షుణ్ణంగా విశ్లేషించారు.నిందితులు సంఘటనా స్థలం నుంచి తీసుకెళ్లిన రెండు మోటార్ సైకిళ్లపై కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు పారిపోయి, అనంతరం వాటిని పెద్ద పాపయ్యపల్లి గ్రామం సమీపంలో వదిలివెళ్లినట్లు పోలీసులు గుర్తించారు.

**ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు ప్రత్యేక పోలీసు బృందాలు**

దర్యాప్తులో లభించిన ఆధారాల మేరకు నిందితులను గుర్తించి పట్టుకునేందుకు కరీంనగర్ నుంచి నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు వెళ్లాయి. మీరట్ పోలీసుల సహకారం, సమన్వయంతో వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. నిరంతర ప్రయత్నాల ఫలితంగా 29.07.2026న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు.

**బాధితుడి అల్లుడు, మనవడే ప్రధాన సూత్రధారులు**

దర్యాప్తులో బాధితుడు ఎం.డి. అజ్మత్ అలీ అల్లుడు A1 మొహమ్మద్ రజావుద్దీన్,బాధితుడి మనవడు A2 మొహమ్మద్ అజీమ్‌రజా ఈ నేరానికి ప్రధాన సూత్రధారులుగా ఉన్నట్లు వెల్లడైంది. A1రజావుద్దీన్ బాధితుడు ఎం.డి.అజ్మత్ అలీ అల్లుడు. ఇతను ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందినవాడు. A1 రజావుద్దీన్‌కు, అతని భార్యకు మధ్య కొంతకాలంగా వైవాహిక వివాదాలు ఉన్నాయి.రజావుద్దీన్ వివాహేతర సంబంధాలు కొనసాగిస్తున్నాడని,చెడు అలవాట్లకు బానిసై తనను వేధిస్తున్నాడని ఆరోపిస్తూ అతని భార్య గత సంవత్సరం తన పుట్టింటికి వచ్చేసింది. అనంతరం రజావుద్దీన్ కూడా కరీంనగర్‌కు వచ్చి తన భార్యను తిరిగి తనతో తీసుకెళ్లేందుకు ప్రయత్నించినప్పటికీ ఆమె అంగీకరించలేదు. ఆ తర్వాత అతను ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితుడి కుటుంబ సభ్యులు అతనికి వైద్య చికిత్స చేయించడంతో పాటు తమ ఇంట్లో ఆశ్రయం కల్పించారు.అంతేకాకుండా అతను గార్మెంట్ వ్యాపారం ప్రారంభించేందుకు ఆర్థిక సహాయం కూడా అందించారు. బాధితుడి ఇంట్లో నివసించిన సమయంలో రజావుద్దీన్‌కు ఆ ఇంటి గురించి, కుటుంబ సభ్యుల గురించి, నగదు మరియు విలువైన వస్తువులను ఎక్కడ భద్రపరుస్తారనే విషయాలపై పూర్తి అవగాహన ఏర్పడింది. బాధితుడి కుటుంబం A1కు గార్మెంట్ వ్యాపారం ప్రారంభించేందుకు ఆర్థిక సహాయం అందించినప్పటికీ, అనంతరం అతను వ్యాపారంలో నష్టపోయాడు.దీంతో తన భార్య, మామ వద్ద పదేపదే డబ్బులు కోరడం ప్రారంభించాడు.ఇటీవల రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయగా వారు నిరాకరించడంతో,బాధితుడి ఇంట్లో దోపిడీ చేయాలని పథకం రూపొందించాడు.

**దోపిడీకి కుట్ర - అమలు**

బాధితుడి ఇంటి గురించి, అక్కడ నగదు, విలువైన వస్తువులు ఉండే ప్రదేశాల గురించి తనకు ఉన్న పూర్తి అవగాహనను ఉపయోగించుకుని A1 రాజావుద్దీన్ తన కుమారుడు A2 అజీమ్ రజా, మీరట్‌కు చెందిన ఇతర సహచరులతో కలిసి దోపిడీకి కుట్ర పన్నాడు. పథకంలో భాగంగా నిందితులు 20.07.2026న మీరట్ నుంచి రామగుండం వైపు రైలులో ప్రయాణించారు.21/22.07.2026 మధ్య రాత్రి డమ్మీ పిస్టల్స్, కత్తులతో బాధితుడి ఇంట్లోకి ప్రవేశించి,కుటుంబ సభ్యులను బెదిరించి,నిర్బంధించి దోపిడీకి పాల్పడ్డారు.

**అరెస్టయిన నిందితులు**

మీరట్‌లో క్రింది ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు :A3. సల్మాన్ ఏ భూరే ఏ యాదవ్, వయస్సు 22 సంవత్సరాలు, వృత్తి: పండ్ల వ్యాపారి,మీరట్, ఉత్తరప్రదేశ్. A4. సల్మాన్ ఏ విమాన్, వయస్సు 22 సంవత్సరాలు, వృత్తి: కూలీ, మీరట్, ఉత్తరప్రదేశ్.A5. మొహమ్మద్ హసీన్, వయస్సు 19 సంవత్సరాలు, మీరట్, ఉత్తరప్రదేశ్.A3 నుంచి A5 వరకు నిందితులను మీరట్‌లోని సంబంధిత న్యాయస్థానం ముందు హాజరుపరిచి, ప్రిజనర్ ట్రాన్సిట్ వారెంట్లు పొందిన అనంతరం కరీంనగర్‌కు తీసుకువచ్చారు. వారిని కరీంనగర్‌లోని సంబంధిత గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరుస్తున్నారు.ఈ సంచలనాత్మక దోపిడీ కేసును స్వల్ప వ్యవధిలో విజయవంతంగా ఛేదించేందుకు నిరంతరం శ్రమించి, సీసీటీవీ ఫుటేజీలు,సాంకేతిక ఆధారాలను విశ్లేషించి,నిందితులను ఉత్తరప్రదేశ్ లో గుర్తించిన దర్యాప్తు అధికారులు మరియు ప్రత్యేక పోలీసు బృందాల అంకితభావం, సమన్వయంతో కూడిన కృషిని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభినందించారు.

# కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 31 :** జగిత్యాల జిల్లా ధరూర్ క్యాంప్ లోని పాత ఎస్పీ కార్యాలయ భవనంలో తాత్కాలిక ప్రాంగణంలో నిర్వహిస్తున్న కేంద్రీయ విద్యాలయం 2026-27 విద్యా సంవత్సరానికి బాలవాటిక-1 (నర్సరీ)నుంచి ఐదవ తరగతి వరకు ప్రవేశాల కోసం ఆఫ్లైన్ విధానంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ శుక్రవారం తెలిపారు.అర్హత కలిగిన విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను కేంద్రీయ విద్యాలయంలో చేర్పించేందుకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. దరఖాస్తుల స్వీకరణ ఆగస్టు 1,2026 నుంచి ప్రారంభమై ఆగస్టు 14,2026 వరకు కొనసాగుతుందని, ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.40 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు. దరఖాస్తులను పూర్తిగా పూరించి,అవసరమైన ధ్రువ పత్రాలతో కలిసి కేంద్రీయ విద్యాలయం చెల్గల్, తాత్కాలిక క్యాంపస్, పాత ఎస్పీ కార్యాలయ భవనం, ధరూర్ క్యాంప్, జగిత్యాల చిరునామాలో సమర్పించాలని సూచించారు. ప్రవేశాలు బాలవాటిక-1, బాలవాటిక-2,బాలవాటిక-3, ఒకటవ తరగతి,రెండవ తరగతి,మూడవ తరగతి ,నాల్గవ తరగతి,ఐదవ తరగతుల్లో ఖాళీలకు మాత్రమే నిర్వహించబడతాయని తెలిపారు.ప్రవేశాలకు కెవిప్రవేశ మార్గదర్శకాలు-2026-27లో నిర్దేశించిన వయోపరిమితి, నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్థి జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం (వర్తిస్తే), రేషన్ కార్డు, బీపీఎల్, ఆదాయ ధృవీకరణ పత్రం (వర్తిస్తే), రాష్ట్ర లేదా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సేవా ధృవీకరణ పత్రం, బదిలీ వివరాలు, అలాగే కెవి ప్రవేశ మార్గదర్శకాల ప్రకారం అవసరమైన ఇతర పత్రాలను తప్పనిసరిగా సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ప్రవేశాలు కేంద్రీయ విద్యాలయ సంస్థ (కెవి) ప్రవేశ మార్గదర్శకాలు-2026-27కు అనుగుణంగా మాత్రమే నిర్వహించబడతాయని, పూర్తి వివరాల కోసం కేంద్రీయ విద్యాలయాన్ని లేదా జారీ మార్గదర్శకాలను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పేర్కొన్నారు.

# బొచ్చు శంకర్‌కు ఘన సన్మానం



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూలై 31 :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డు అందుకున్న సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్జీ-3 బ్రాంచ్ కార్యదర్శి, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా సీనియర్ నాయకుడు బొచ్చు శంకర్‌ను శుక్రవారం ఎయిట్ ఇంక్లైన్ కాలనీలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా సన్మానించారు.ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కో-కన్వీనర్ఆకునూరి బాలం కూస్ అధ్యక్షతన జరిగినఈ కార్యక్రమములో ముందుగా నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరంఆల్ ఇండియా అంబేద్కర్యువజన సంఘము రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్, బొంకూరి మధు,రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైస రాజేష్, ఏఐటీయూసీ కేంద్ర కమిటీ నాయకుడు కందుకూరి రాజారత్నంలు బొచ్చుశంకర్‌కు శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అతిథిలు మాట్లాడుతూ దళిత,బహుజన,అణగారిన వర్గాల అభ్యున్నతితో పాటు, సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి బొచ్చు శంకర్ అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. ఆయన సేవలను గుర్తించి బహుజన సాహిత్య అకాడమీ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డును ప్రదానం చేయడం అభినందనీయమని, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ద్వారా ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహిస్తున్న బొచ్చు శంకర్‌కు అభినందనలు తెలియజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో శనిగరపు పోచయ్య, బైరం సదానందం, మేకల సురేష్, గుడిశాల రాజశేఖర్, పశువుల సురేష్,బొల్లి మల్లేష్, ఎల్లావుల రాములు,వేముల శ్రీనివాస్,కుమ్మరి శ్రీనివాస్,నీలం మదన్‌మోహన్, పాముల నాగేశ్వరరావు,రామగిరి రమేష్,భోగే వెంకటేష్, సంగి రవీందర్, మహమ్మద్ ఇషాక్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ సేవలో డీటీఓ కొండ కర్ణాకర్ సేవలు అభినందనీయం

**-డీటీఓకు వీడ్కోలు సభలో టీజీఓఎస్ జిల్లా అధ్యక్షుడు తూము రవీందర్ పటేల్**



పెద్దపల్లి జిల్లా ఖజానా శాఖ సహాయ సంచాలకులు (డీటీఓ) మరియు టీజీఓఎస్ ట్రెజరర్ కొండ కర్ణాకర్ పదవీ విరమణ పొందిన సందర్భంగా

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూలై 31 :** ప్రభుత్వ సేవలో నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించిన కొండ కర్ణాకర్ సహ ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచారని టీజీఓఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు, జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) తూము రవీందర్ అన్నారు. టీజీఓఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా వీడ్కోలు మరియు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించిన తూము రవీందర్ మాట్లాడుతూ.. కొండ కర్ణాకర్ తన సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.పదవీ విరమణ అనంతరం కూడా ఆయన ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో శేష జీవితాన్ని గడపాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.తూము రవీందర్ తో పాటు ఇతర అధికారులు కొండ కర్ణాకర్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌టీఓ సాజిద్ అలీ, డీఏఓ రవీంద్రనాథ్, డాక్టర్ జి. సురేష్, డాక్టర్ టి.మల్లేష్‌లతో పాటు ఖజానా శాఖ అధికారులు,టీజీఓఎస్ నాయకులు,సిబ్బంది పాల్గొని డీటీఓ కొండ కర్ణాకర్‌కు వీడ్కోలు పలికారు.